క్లుప్తంగా

కేశవపురం దాహార్తి తీర్చండి

విజయపురం: మండలంలోని కేశవపురం ఆది ఆంధ్రవాడలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లత్తూరు కుశస్థలినది నుంచి రావాల్సిన తాగునీరు గత 15 రోజులుగా రావడం లేదని స్థానిక ప్రజలు తెలిపారు. దీంతో వ్యవసాయ పొలం, బావులపై ఆధారపడుతున్నారు. సచివాలయ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

యాదవ మహాసభ అధ్యక్షుడిగా సుబ్రమణ్యం



సుబ్రమణ్యం యాదవ్‌కు సత్కారం

విజయపురం: తిరుపతి జిల్లా యాదవ మహాసభ అధ్యక్షుడిగా జంబాడ గ్రామానికి చెందిన సుబ్రమణ్యంయాదవ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యాడు. ఈ మేరు శుక్రవారం రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు కోన గురవయ్య యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యంయాదవ్‌ను పలువురు సంఘ నాయకులు దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

స్వామిత్వ సర్వేతో పూర్తి హక్కులు



సర్వేని పరిశీలిస్తున్న డీపీఓ సుధాకర్‌రావు

గంగాధరనెల్లూరు: గ్రామ కంఠంలో నివాసాలు ఏర్పరచుకున్న ప్రతి ఒక్కరికి స్వామిత్వ సర్వే ద్వారా పూర్తి హక్కులు కల్పించడమే లక్ష్యమని డీపీఓ సుధాకర్‌రావు అన్నారు. నెల్లేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

నేడు సాధారణ సర్వసభ్య సమావేశం

శ్రీరంగరాజపురం: నేడు మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు గురువారం ఎంపీపీ సరిత, ఎంపీడీఓ మోహన్‌మురళి తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల అభివృద్ధి కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా గ్రామ దేవతల ఊరేగింపు



గ్రామదేవత దేశమ్మను వాహనంపైకి మోసుకెళ్తున్న భక్తులు

నగరి: మున్సిపల్ పరిధి పుదుపేటలో గ్రామదేవతలు దేశమ్మ, ఓరుగుంటాలమ్మలను గురువారం ఘనంగా ఊరేగించారు. నగరి జాతరకు విచ్చేసే దేశమ్మ, ఓరుగుంటాలమ్మ దేవతలను జాతర మరునాడు పుదుపేటలో ఊరేగించడం ఆనవాయితీ. ఈ మేరకు గ్రామ పెద్దలు గ్రామ దేవతలను సుందరంగా అలంకరించి పట్టణ వీధుల్లో ఊరేగించగా భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.

పొలాలపై దొంగలు పడ్డారు



ఆలపాకంలో అదృశ్యమైన స్టార్టర్‌లెపై వైర్లు

విజయపురం: మండలంలోని పొలాలపై దొంగలు పడి విద్యుత్ వైర్లు, స్టార్టర్లను దొంగిలిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజుల్లో 40 మందికి పైగా రైతుల స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీ అయ్యాయి. ప్రధానంగా రోడ్డు పక్కన ఉన్న పొలాల్లో చోరీకి పాల్పడుతున్నారు. ఆలపాకం కండ్రిగలో 15 రోజుల వ్యవధిలో రెండు స్టార్టర్లు, వైర్లు చోరీ అయ్యాయని సర్పంచ్ బాబు తెలిపారు. కలియంబాకం, పన్నూరు, బూచివానత్తం, స్వామిరెడ్డికండ్రిగ ప్రాంతాల్లో ఎక్కువగా దొంగతనాలు జరుగుతున్నాయని రైతులు తెలిపారు.

గిరిజనులపై కూటమి శాపం

తల్లిదండ్రులు తమ పిల్లలకు గొప్పగా ఆస్తులు ఇవ్వలేకపోయినా మంచి చదువులు చదివించాలని కోరుకుంటారు. దీనిని పూర్తిగా నమ్మిన గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో పలు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే 2023 ఆగస్టు 28న ముఖ్యమంత్రి హోదాలో నగరికి వచ్చిన ఆయన పుత్తూరులో 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.7.25 కోట్ల అంచనా వ్యయంతో గిరిజన హాస్టల్, స్కూల్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఆ నిధులను రద్దు చేసింది. దీంతో కూటమి ప్రభుత్వం తమ పాలిట శాపంగా పరిణమించిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





పుత్తూరులో ఎస్టీ భవనాలకు కేటాయించిన స్థలం, ఎస్టీ హాస్టల్, స్కూల్ భవనాలకు శంకు స్థాపన చేస్తున్న నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

- గిరిజనుల కోసం నాటి మాజీమంత్రి ఆర్కే రోజా చొరవ
- ఐదెకరాల విస్తీర్ణంలో గిరిజన హాస్టల్, స్కూల్ మంజూరు
- అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకు స్థాపన
- రూ.7.25 కోట్ల నిధులు మంజూరు
- కూటమి ప్రభుత్వం రాకతో నిధులు రద్దు



హాస్టల్, స్కూల్ రెండూ నిర్వహిస్తున్న ప్రస్తుత భవనం

పుత్తూరు: కూటమి ప్రభుత్వం రాకతో ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు నేటికీ పాత హాస్టల్ భవనంలోనే చదువుకోవల్సిన దుస్థితి ఏర్పడింది. స్థానిక గేట్‌పుత్తూరులో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల బాలుర వసతి గృహంలోనే పాఠశాలను సైతం గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. కేవలం 5 గదులు మాత్రమే ఉండగా 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 8 తరగతుల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వాస్తవానికి గురుకుల పాఠశాలలో 320 మంది విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉన్నా కేవలం 106 మంది మాత్రమే ప్రస్తుతం ఉన్నారు. పూర్తిస్థాయిలో విద్యార్థులు చేరకపోవడానికి ప్రధాన కారణం ప్రస్తుతం హాస్టల్, పాఠశాల ఒకటిగా ఉండడం. పైగా ఉన్న 5 గదుల్లోనే 8 తరగతులను నిర్వహించాల్సి రావడం మరో కారణం. ఇరుకు గదుల్లో చదువులతోపాటు అందరూ అక్కడే పడుకోవాల్సి ఉంది. దీంతో పాఠశాలను సందర్శించిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఇందులో చేర్పించడానికి సుముఖత చూపడం లేదు. ఈ దుస్థితిని గుర్తించిన అప్పటి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా నూతన భవన నిర్మాణాలకు స్థలంతో పాటు కోట్లాది రూపాయల నిధులను గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో మంజూరు చేయించారు.

శంకుస్థాపన

2023 ఆగస్టు 28న నియోజకవర్గ కేంద్రమైన నగరిలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించారు. ఆనాటి స్థానిక మంత్రి ఆర్కే రోజా అభ్యర్థన మేరకు పుత్తూరు పట్టణ పరిధిలోని నందిమంగళం గ్రామ పరిధిలో గిరిజన గురుకుల పాఠశాల, వసతి గృహం నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఇందుకు నందిమంగళం రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నెంబర్ 199లో 5 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా రూ.7.25 కోట్ల నిధులను మంజూరు చేశారు.

కూటమి ప్రభుత్వం రాకతో నిధులు రద్దు

గిరిజన విద్యార్థులకు విద్యా సదుపాయాలు కల్పించాలనే సదుద్దేశంతో గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం కోట్లు విలువ చేసే స్థలంతోపాటు కోట్లది రూపాయల నిధులను మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియను సైతం పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో వచ్చిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే నిధులను రద్దు చేసింది. దీంతో గిరిజన కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఏ ప్రభుత్వమైనా మంచి చేయాలి



మా అబ్బాయి బాలాజీ పుత్తూరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. కొత్త పాఠశాల, హాస్టల్ భవనాలకు శంకు స్థాపన చేశారని సంతోషించాం. కొత్త ప్రభుత్వం వచ్చి ఆ పనులను ఆపేశారని తెలిసింది. ఇది ఎంత వరకు న్యాయం. మంచి పనులను ఏ ప్రభుత్వమైనా చేయాలి. వెంటనే పనులు ప్రారంభించి మా బిడ్డలకు మంచి చదువులు, వసతి కల్పించాలని కోరుతున్నాం.
–వి.అనిత, వేదాంతపురం ఎస్టీ కాలనీ, నిండ్ర మండలం

మా బిడ్డలు గొప్ప చదువులు చదవాలి



మా పిల్లలు వెంకటరమణ 9వ తరగతి, దినేష్ 8వ తరగతి పుత్తూరులోని గిరిజన పాఠశాలలో చదువుతున్నారు. మా బిడ్డలు కూడా మంచి భవనాల్లో మంచి చదువులు చదువుకోవాలి. అందుకు అన్ని ఏర్పాట్లు చేయాల్సింది ప్రభుత్వాలే. ఎందుకు మాకు సంబంధించిన వాటిని మాత్రమే ఆలస్యం చేస్తున్నారు?
–టి.కుమారి, కనికాపురం ఎస్టీ కాలనీ, నిండ్ర మండలం

మాజీ మంత్రికి పేరు రాకూడదనే!



నగరి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేసి, చూపెట్టిన మాజీ మంత్రి ఆర్కే రోజాకు మరింత మంచి పేరు రాకూడదనే ప్రస్తుత కూటమి ఎమ్మెల్యే గురుకుల పాఠశాల, హాస్టల్ భవన నిర్మాణానికి కేటాయించిన నిధులను రద్దు చేయించారు. మంచి పనులను ఆపుతున్న కూటమి ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి.
–ఇ.చిరంజీవి, వైఎస్ఆర్ సీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి, పుత్తూరు

మళ్లీ నిధులు మంజూరు కావాలి

గత ప్రభుత్వంలో మంజూరైన నిధులు రద్దు అయ్యాయి. కనుక మళ్లీ నిధులు మంజూరు అయితేనే పనులు ప్రారంభమవుతాయి. భవన నిర్మాణాల కోసం కేటాయించిన భూమి మాత్రం ఆదే శాఖకు చెందిందిగా ఉంటుంది.
–జాన్, ఏఈ, ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, నెల్లూరు

నాసిరకమైన ఇసుకతో సీసీరోడ్లు



ఎర్రగా ఉన్న నాసిరకం ఇసుక

పాలసముద్రం: మండలంలో ప్రస్తుతం గ్రామాల్లో వేస్తున్న సిమెంట్ రోడ్ల నిర్మాణాకి నాసిరకమైన ఇసుక వాడుతున్నారు. అధికారులు కూడా సిమెంట్ రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్ టీడీపీ నాయకుడు కావడంతో పట్టించుకోవడం లేదు. వంకలోని ఇసుక 10 ట్రాక్టర్లు, రెండు, మూడు లోడ్ల నీవానది ఇసుకను కలిపి సిమెంట్ రోడ్లు వేస్తున్నారు. గ్రామంలో వేస్తున్న సీసీ రోడ్లకు వంకలో ఉన్న ఇసుకను ఉపయోగిస్తున్నారని డీఈకి చెప్పినా చూసీచూడనట్లు వెళ్లిపోతున్నాడు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి సిమెంట్ రోడ్లకు నాణ్యమైన ఇసుక వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అల్లిఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



అల్లిఎల్లమ్మ ఆలయం వద్ద పూజలు

గంగాధరనెల్లూరు: వైఎస్ఆర్ సీపీ రాజంపేట పార్లమెంటు సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన సందర్భంగా గురువారం జీడీనెల్లూరు మండల కేంద్రంలోని అల్లియల్లమ్మ ఆలయంలో వైఎస్ఆర్ టీయూసీ యూనియన్ నాయకులు కలిజవేడు సుబ్రహ్మణ్యంరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. మిథున్ రెడ్డి అక్రమ కేసుల నుండి కడిగిన ముత్యంలా త్వరగా బయటకు రావాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు నరసింహారెడ్డి , అశోక్ రెడ్డి, జలంధర్, సుబ్రహ్మణ్యం, సురేష్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీతో కృపాలక్ష్మి సమావేశం





మిథున్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న జీడీనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి,
మిథున్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ లత దంపతులు

కార్వేటినగరం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని జీడీనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మి కుటుంబ సభ్యులు గురువారం మిథున్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని విజయవాడ ఎయిర్‌పోర్టులో కలసి పుష్పగుచ్ఛాన్ని అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కార్వేటినగరం మండలం ఎంపీపీ లత, జిల్లా కార్యదర్శి బాలాజీ దంపతులు మిథున్‌రెడ్డిని కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మట్టి నమూనాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుత్తూరు: గోపాలకృష్ణాపురం గురుకుల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం మట్టి నమూనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాయిల్ టెస్టింగ్ లాబొరేటరీ తిరుపతి వ్యవసాయాధికారి కుముదకీర్తి మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా మట్టి సారం కోల్పోతుందని తెలిపారు. అనంతరం మట్టి నమూనాల సేకరణ విధానాన్ని వివరించారు. ఈ విషయాలపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పుత్తూరు వ్యవసాయాధికారి కోదండయ్య, తిరుపతి ఏఓ శ్రీనివాస్, ఎస్టీఎల్ ఏఓ పుష్పావతి, రాస్ కేవీకే ప్రియాంక, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేలో నగరి విద్యార్థుల ప్రతిభ





బహుమతులు సాధించిన నగరి విద్యార్థులు, బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

నగరి: తమిళనాడు ఆర్‌కే పేటలో నిర్వహించిన ఆలిండియా కరాటే పోటీల్లో నగరికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్థానిక కరాటే మాస్టర్ రాజ్‌కోటి నేతృత్వంలో 32 మంది ఈ పోటీల్లో పాల్గొనగా వివిధ విభాగాల్లో 14 మంది ప్రథమ బహుమతిని, ఆరుగురు ద్వితీయ బహుమతిని, 8 మంది తృతీయ బహుమతిని కై వసం చేసుకున్నారు. ప్రతిభ చూపి బహుమతులు సాధించిన విద్యార్థులు సినీ నటుడు రియాజ్‌ఖాన్ నుంచి బహుమతులు అందుకున్నారు.

బాధిత కుటుంబానికి భరోసా

నగరి: మున్సిపల్ పరిధి కేవీపీఆర్‌పేటకు చెందిన స్టేట్ వీవర్ సెల్ కార్యదర్శి అయ్యప్ప తల్లి గురువారం ఉదయం ఆకస్మికంగా మృతిచెందారు. మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అయ్యప్ప నివాసానికి చేరుకొని ఆయన తల్లి భౌతిక కాయానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నగరి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, కౌన్సిలర్ మురుగ, కో–ఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్ రెడ్డి

సీహెచ్‌సీకి ఇద్దరు సర్జన్‌లు

కార్వేటినగరం: సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు సర్జన్లు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇందులో భాగంగా పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ క్రిష్ణకాంత్ డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతిపై కార్వేటినగరం సీహెచ్‌సీలో బాధ్యతలు తీసుకున్నారు. అలాగే గూడూరు ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన డిప్యూటీ డెంటల్ సర్జన్‌గా పదోన్నతిపై కార్వేటినగరం సీహెచ్‌సీలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో సమయపాలన పాటించి, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. అనంతరం సీహెచ్‌సీ సిబ్బంది డాక్టర్లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, స్వాగతించారు.



బాధ్యతలు చేపట్టిన డాక్టర్లు క్రిష్ణకాంత్, మోహనను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



కొల్లాగుంట ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సుధాకర్‌రావు

కార్వేటినగరం: గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామ సచివాలయం, ఎస్‌డబ్ల్యూపీసీ ప్రాంతాలను సచివాలయ సిబ్బందితో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యాధులు ప్రబలకుండా ఉంటుందని, అలాగే మురుగునీరు వీధులపై ప్రవహించకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని అన్నారు. వారానికి ఒక్కసారి మురుగు నీటి కాలువలు, చేతి పంపులు తదితర నీటి నిల్వ ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ చేయాలని సూచించారు. సర్పంచ్ దివ్యగాంధీ, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విశ్వ గురువు స్వామి వివేకానంద

పుత్తూరు: భారతదేశపు సంస్కృతి, నాగరికతలను ప్రపంచానికి చాటిచెప్పిన స్వామి వివేకానంద విశ్వ గురువుగా ప్రసిద్ధిగాంచారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి తెలిపారు. గురువారం కళాశాలలో వివేకానందస్వామి అమెరికాలోని చికాగోలో చారిత్రాత్మక ప్రసంగం ఇచ్చిన రోజును పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ స్వామి ఇచ్చిన ఉపన్యాసాలు, సందేశాలు నేటికీ యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మన్యం నరసింహులు, అధ్యాపకులు దేవకి, వాసవి, సూర్యబాబు, తిరుమలయ్య, గంగయ్య, శ్రీదేవి, వసంత్, శ్రీనివాసులు, కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం

విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలి

వడమాలపేట (పుత్తూరు): కిషోర బాలబాలికలు విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాంజలి సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పది రోజులపాటు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కిషోర బాలికలు లింగ సమానత్వం, మహిళ భద్రత, న్యాయ విజ్ఞానం, మహిళా సాధికారిత, రుతుక్రమ పరిశుభ్రత, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా సఖి గ్రూపులను ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ గీతాంజలి

వైభవంగా పొన్నియమ్మ ఊరేగింపు

నగరి: మున్సిపల్ పరిధి కేవీపీఆర్‌పేటలో గ్రామదేవతలు పొన్నియప్ప ఊరేగింపు గురువారం వైభవంగా నిర్వహించారు. జాతర వేడుకలను పురస్కరించుకుని అమ్మవారి ఊరేగింపునకు చేసిన అలంకరణలు అందరినీ అమితంగా ఆకట్టుకుంది. ఊరేగింపుగా వచ్చిన పొన్నియమ్మ దేవతకు భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చి దర్శించుకున్నారు.



345 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

బంగారుపాళెం: చిత్తూరు నుంచి బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న 345 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన గురువారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు డీటీ బాబు, తమ సిబ్బందితో కలిసి మొగిలి ఘాట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో రెండు వాహనాల్లో (ఐచర్, 407 వాహనాలు)అక్రమంగా తరలిస్తున్న 345 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని వెల్లడించారు. గంగవరానికి చెందిన భానుమూర్తి, పలమనేరు పట్టణం గంటావూరుకు చెందిన రోషన్‌ను అరెస్టు చేశారు.

వేడుకగా మహా కుంభాభిషేకం

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆలత్తూరు గ్రామ సమీపంలో వెలసిఉన్న శ్రీముత్యాలమ్మ ఆలయంలో గురువారం మహా కుంభాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో వేద పండితులు వేద మంత్రాలతో గణపతి, హోమం నిర్వహించారు. అదే విధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ క్రమంలో భాగంగా భక్తులు అమ్మవారికి పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజులపాటు జరిగిన మహా కుంభాభిషేకం వేడుకల్లో రమణయ్య కుటుంబ సభ్యులు నిత్యాన్నదానం చేపట్టారు. దీంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రమణయ్యశెట్టి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త జనార్దన్‌రెడ్డి, గురుస్వామి, సుబ్రమణ్యంరెడ్డి, చిరంజీవిరెడ్డి, పురంధర్, నాగరాజు ఆచారి తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం

రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ మృతి



ప్రమాదానికి గురైన టిప్పర్

పుత్తూరు: పట్టణ పరిధిలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ శేఖర్‌రెడ్డి కథనం మేరకు.. తిరుపతి– చెన్నై జాతీయ రహదారిలోని డివైడర్‌పై ఉన్న మొక్కలకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్‌ను చెన్నై నుంచి తిరుపతి వైపు వెళ్తున్న టిప్పర్ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ ఢిల్లీబాబు(49) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తమిళనాడుకు చెందిన తిరువళ్లూరు జిల్లా తత్తమంజి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.